క్లుప్తంగా

లోకాయుక్తను కలసిన ఆర్డీఓ

పెద్దతిప్పసముద్రం : ఉమ్మడి హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మూడు రోజుల క్రితం మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్ శుక్రవారం చెన్నరాయునిపల్లిలో విడిది చేసిన లోకాయుక్తను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలు, భూ సమస్యలపై చర్చించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ నరసింహరావ్, డీటీ విద్యాసాగర్, ఆర్ఐ అనీషా, స్థానిక వీఆర్వో ఖాదర్‌బాషా తదితరులు ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

పెద్దతిప్పసముద్రం : అరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఫణితేజ స్వామి, నరసింహ శాస్త్రిలు శివ, పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏనుగుమల్లమ్మను పట్టుచీర, నగలు, గాజులు, కిరీటంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోర్టులో గంగమ్మ ఆలయంలో రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మదనపల్లె సిటీ : స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహు,కాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నిమ్మకాయలతో దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బీ.కె.పల్లి భక్తాదులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి అభిషేకం


ప్రత్యేక అలంకారంలో శ్రీచౌడేశ్వరిదేవి

రామసముద్రం : మండలంలోని కుదురుచీమనపల్లి పంచాయతీ గుంతయంబాడి గ్రామంలో వెలసిన పురాతన శ్రీచౌడేశ్వరిదేవి సప్తమాత్రికల ఆలయంలో జేష్టఅమావాస్య పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అమ్మవారికి వేపాకు, నిమ్మకాయలతో ప్రత్యేక పూలతో అలంకారం చేశారు. ఆలయ అర్చకులు కృష్ణయ్యగారి రాఘవేంద్రరావు, లక్ష్మీనారాయణరావు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కోలారుకు చెందిన చౌడమ్మ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

డెంగీపై అవగాహన సదస్సు

వాల్మీకిపురం : జాగ్రత్తలతో డెంగీ, డయేరియాని నివారించవచ్చునని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. శుక్రవారం మండలంలోని చారావాండ్లపల్లిలో డెంగ్యూ, డయేరియాపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమతెరలను వాడాలని సూచించారు. డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ముజీబ్‌బాషా, సుధాకర్, సౌజన్య, నిర్మల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వైకల్య నిర్ధారణ పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి


బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

మదనపల్లె సిటీ : దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాలబాలికలకు ఉచిత ఉపకణాల పంపిణీ కోసం అర్హత పరీక్షలు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యం కోల్పకుండా ప్రభుత్వం అందించే ప్రతి సదుపాయంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్‌లోని 11 మండలాల దివ్యాగ పిల్లలకు ఉపకరణాల పంపిణీకి 154 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. వీరికి కావాల్సిన వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, సీపీ చైర్స్, రోలేటర్‌లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహిత విద్య కో ఆర్డినేటర్ జనార్ధన్, సీఎంఓ కరుణాకర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సహిత విద్య ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన డీఈఓ

డీఈఓ ఉపాధ్యాయుడిగా మారారు. స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి పాఠశాల గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా తరగతి గదిలో కొద్ది సేపు పాఠం చెప్పారు. వారి నోటుపుస్తకాలు, సబ్జెక్టుల వారి సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలో కలిసి మధ్యాహ్నం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం రఘు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లలను బడిలో చేర్పించాలి

బడికి రాని పిల్లలను బడిలో చేర్పించాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కింద తరగతి నుంచి ప్రతి ఒక్క విద్యార్థి పై తరగతిలో చేరే విధంగా కృషి చేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంఓ కరుణాకర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులు, భాస్కరన్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు సహాయ సహకారాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

వాల్మీకిపురం : అర్హులైన నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా వాల్మీకిపురంకు వచ్చిన కిషోర్ కుమార్‌రెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వాల్మీకిపురం ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని, తనకు తుది శ్వాస ఉన్నంత వరకు వాయల్పాడు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. గ్రామస్థాయిలో టీడీపీ నాయకులు ఎవ్వరూ ఇతర పార్టీల నాయకులను వేధించవద్దన్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన తప్పులు ఎవ్వరూ చేయొద్దని సూచించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి, క్రిష్టారెడ్డి, మల్లికార్జున రెడ్డి, వల్లిగట్ల వెంకట్రమణ, గాంధీపేట రమణ, నరేంద్ర రెడ్డి, దినేష్ రాయల్, రాజేంద్రాచారి, ద్వారకనాథ రెడ్డి, చంద్రమౌళి, మురళి, సయ్యద్‌బాషా, శేషు రెడ్డి, పివి నారాయణ, రెడ్డి, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


బహుమతిని అందిస్తున్న దాత గోవింద రెడ్డి

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శుక్రవారం మండలానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు గోవింద రెడ్డి నగదు బహుమతులను అందించారు. ఈ సదర్భంగా మండల విద్యాధికారి వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు చదువుకున్న విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలో చదువుతున్న హాస్సిక ప్రథమ బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ. వెయ్యి నగదు ప్రోత్సాహక బహుమతులుగా అందించారు. అనంతరం హెచ్‌ఎం రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ గత మూడు ఏళ్లుగా దాత గోవింద రెడ్డి నగదు బహుమతులను అందించి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటలక్ష్మి, విశ్రాంత ఎంఈవో నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి


మాట్లాడుతున్న ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ

మదనపల్లె సిటీ : ఆడపిల్లలను పెంచడమే కాదు.. ఉన్నత చదువులు చదివించాలని మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు.శుక్రవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో క్రై, ఫోర్డు సంస్థల ఆధ్వర్యంలో పూరిపదాయ్ దేసికి భిణాయ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మాయిల పట్ల కుటుంబంలో, సమాజంలో వుండే అపోహలలు తొలగిపోవాలంటే తల్లిదండ్రులకు అవగాహన ఎంతైనా అవసరం ఉందన్నారు. సెకండరీ విద్యలోనే అమ్మాయిలను చదువు మాన్పిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నాయన్నారు. ఫోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ చదువుకు దూరమైన పిల్లలు తిరిగి బడిలో చేరిపించడం, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మాయిల చదువును ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రచర్స్,తేజస్విని, హిమబిందు, హర్షిత,త దుర్గ, ఫోర్డు సిబ్బంది రాధారాణి, స్వర్ణకుమారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి


రేణుకమ్మను జిల్లా ఆస్పత్రిలో పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : అధికార టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణుకమ్మపై దాడిచేసిన రెడ్డెప్పపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోపుకృష్ణప్ప, సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణుకమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ములకలచెరువు వినాయక నగర్‌కు చెందిన రేణుకమ్మ, సుబ్రహ్మణ్యంలకు ప్రభుత్వం 1.5 సెంట్లు స్థలం మంజూరు చేశారన్నారు. ఈ స్థలంలో వారు రేకులషెడ్డును ఏర్పాటు చేసుకుని, పక్కనే బంకు పెట్టుకుని జీవిస్తున్నారన్నారు. బంకు పక్కన ఉన్నటువంటి టీడీపీ నాయకుడు రెడ్డెప్ప, రేణుకమ్మకు కేటాయించిన స్థలంలో జేసీబీతో పునాదులు తవ్వేందుకు ప్రయత్నించాడన్నారు. దీన్ని ప్రశ్నించినందుకు రేణుకమ్మను విచక్షణారహితంగా దాడిచేసి బండబూతులు తిడుతూ తీవ్రంగా గాయపరిచాడన్నారు. దీన్ని అవమానంగా భావించిన రేణుకమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. రేణుకమ్మకు జరిగిన అన్యాయంపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా, ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దాడిచేసిన రెడ్డెప్ప, అతడి అనుచరులపై దిశ చట్టం కింద కేసు నమోదుచేసి ఆమెకి న్యాయం చేయాలని కోరారు.

8న జాబ్‌మేళా

తంబళ్లపల్లె : పుంగనూరు ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె టీఎస్ వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వ ఐటీఐ, పుంగనూరులో ఐటీఐలో పని చేసినవారు, శిక్షణ పొందుతున్న వారితో పాటు ఇంటర్,డిగ్రీ పాసైనా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. చైన్నై, బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరై అర్హులైనవారిని క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు

కలికిరి : కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని మేడికుర్తి, మహల్, పాతెం పశువైద్య కేంద్రాలలో జోనోసిస్ డే సందర్భంగా శనివారం రోజున పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వెంకటమునినాయుర్డొక ప్రకటన తెలిపారు. పెంపుడు జంతుల వలన మనుషులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెంపుడు జంతులువు కలిగిన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

8న వారపు సంత వేలం

పెద్దతిప్పసముద్రం : స్థానిక సచివాలయంలో ఈ నెల 8న వారపు సంత, బస్టాండ్ గేటు, జంతువధ శాలకు సంబంధించి వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు వారపు సంత, బస్టాండ్ గేటుకు సంబంధించి రూ.10 వేలు, జంతు వధశాలకు రూ.5 వేల చొప్పున ముందస్తు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కార్యదర్శి సూచించారు.

మట్లివారిపల్లె వీఆర్వో ఆకస్మిక మృతి


ముజీబ్ (ఫైల్)

కురబలకోట : మండలంలోని మట్లివారిపల్లె వీఆర్వో ముజీబ్ (60) శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. మదనపల్లె పట్టణం కురవంక ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇతను విధులకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతుండగా హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి ముగ్గురు పిల్లలు. విధి నిర్వహణలో కూడా వివాదరహితుడిగా, మంచి వాడిగా పేరు తెచ్చుకున్నారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

తిరుపతికి కొత్త బస్సులు

మదనపల్లె సిటీ : తిరుపతికి అశోక్‌లైలాండ్ బీఎస్–3, బిఎస్–4, అల్ట్రా డీలక్స్ ఎక్స్‌ప్రెస్ నూతన బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం టు డిపో గ్యారేజీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. వారం రోజుల పాటు అన్ని బస్సులో బ్రేక్‌రోల్, బ్రేక్‌జామ్,ఫ్రీ రోలింగ్, ఎయిర్ ఫిల్టర్‌క్లీనింగ్ వంటికి క్షుణంగా పరిశీలించి పనులు చేయడం జరుగుతుందన్నారు. తిరుపతికి వెళ్లే ప్రతి డ్రైవర్ కెఎంపిఎల్ పెంచాలన్నారు. జూన్ నెలలో కెఎంపిఎల్ 5.14 ఉన్నదని దీనిని 5.50కు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

మదనపల్లె : సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రాంతాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ రెడ్డెమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటుగా, తాగునీటి సరఫరా ట్యాంకులను ప్రతి 15రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. డయేరియా విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుని ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వశాఖల వారీగా జరిగిన సమీక్షలో విద్యాశాఖకు సంబంధించి ఎంఈఓ ప్రభాకరరెడ్డి నూతన విద్యావ్యవస్థపై అవగాహన కల్పించారు. హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు మాట్లాడుతూ మండలంలో కేటాయించిన 2,480 ఇళ్లకు గాను, 325 ఇళ్ల ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణపనులు ప్రారంభిస్తే, తక్షణం వారి ఖాతాల్లో డబ్బులు జమచేసేందుకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీటీఎం పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ... ప్రజలు టీబీ బారిన పడకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీజీ టీకాలు ఉచితంగా వేస్తున్నామన్నారు. ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ.. జూలై 1 నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక పారిశుధ్యపనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు వెలుగుచంద్ర, వైస్ ఎంపీపీలు డిష్‌రమణ, నందినితాజ్, సర్పంచ్‌లు ఆనందపార్థసారధి, శరత్‌రెడ్డి, సిద్దలదీపా, బుద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధనకు ఆటంకం కలిగించే యాప్‌ల రద్దుకు డిమాండ్


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

గుర్రంకొండ : బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి, కార్యదర్శులు జాబీర్, భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలు పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో నెం. 117 ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ప్రాథమిక విద్యలో, ఆరు నుంచి పదవ తరగతి వరకు, ఆరు నుంచి 12 వతరగతి వరకు సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమానికి సమాంతరంగా తెలుగు లేదా ఉర్దూ మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రుల అభీష్టం మేరకు వారికి నచ్చిన మాధ్యమాల్లో చదుకొనే అవకాశం కల్పించాలన్నారు. అనవసర యాప్‌లను రద్దు చేసి బోధనేతత కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసి ప్రాథమిక విద్యలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చొరవ తిసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అజ్మతుల్లా, యూటీఎఫ్ నాయకులు యూసూఫ్, వెంకటయ్య,రెడ్డెన్న, రాజేంద్రప్రసాద్, శంకరయ్య, హసన రజనీ, షమాభాను తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అక్రమాలపై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక గ్రామ పంచాయతీలో 2021–22 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పంచాయతీకి వచ్చిన ఆదాయం రికార్డులు పరిశీలించారు. పంచాయతీ పరిధిలో కార్మికుల సంఖ్య, నెలవారీ వేతనాలు, వాహనాలు, డీజిల్ ఖర్చులుకు సంబంధించి రికార్డులు, ఎంబుక్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేధిస్తామని డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పరుశురాం, నాగేశ్వర్, హరి, నవీన్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానాభిరామస్వామి సహస్ర కలశాభిషేకం


మహాకుంభారాధన కావిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ జ్ఞానాభిరామస్వామి వారి సహస్ర కలశాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణ కోసం స్వామివారి ఉత్సవాలు మూడురోజులు పాటు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం గణపతిపూజ, వాసుదేవ శుద్ది,పుణ్యావచనం కావించారు. వాస్తుహోమం, అంకురార్పణహోమం, ద్వారతోరణపరుషు, కలశాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ,మూర్తిహోమం, మహాసుదర్శన, శ్రీరామతారక హోమం అష్టలక్ష్మీ హోమాలు చేశారు. ఈసందర్భంగా 1001 కలశాలను ప్రతిష్టించి విశిష్టపూజలు నిర్వహించారు. రోజంతా యజ్ఞయాగాలు నిర్వహించి స్వామివార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. సకాంలో వర్షాలు కురిసి పాడిపంటలతో అందరూ వర్థిల్లాలని కోరుతూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేణుగోపాలబట్టర్, కృష్ణ, గోపాలాబట్టర్, దొరస్వామి, మధుసూధన్, శ్రీనివాసబట్టర్‌లు పాల్గొన్నారు.

పేదలకు 104 వాహన సేవలు వరం


మాట్లాడుతున్న డాక్టర్ లోకవర్ధన్

కేవీపల్లె : పేదలకు 104 వాహన సేవలు వరమని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్లలో 104 వాహన సేవలు తనిఖీ చేశారు. వైద్య పరికరాలను, మందుల నిల్వలను, వాహనం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 సేవలు ప్రతి నెలా నియమిత తేదిన వారి గ్రామానికే వచ్చి వైద్య సేవల తోపాటు మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. వీలైనంత ఎక్కువ మంది సేవలు పొందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అతిసార, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాప్తి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రేష్మ, పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, సిబ్బంది చంద్రమైత్రిసుధ, ఆలేఖ్య, 104 సిబ్బంది వెంకటరమణ, ధరణి రెడ్డి, మోహన్, ఆశలు ధనలక్ష్మీ, శంకరమ్మ తదితరు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని మీ సమస్యగా భావించండి

మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్


రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

పెద్దతిప్పసముద్రం : ప్రజల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీని మీ సమస్యగా భావించి వాటిని పరిష్కరించే దిశగా చొరవ చూపాలని మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు. మండలంలో అధికంగా ఎలాంటి భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయి? పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదులు ఎన్ని పరిష్కరించారు.. సిబ్బంది పని తీరు, మండలంలో ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయింది, తదితర వివరాలను తహసీల్దార్ నరసింహరావును అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గడువులోగా రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పశువులకు ఉచితంగా టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీలోని తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం పాడి ఆవులకు పశువైద్య సిబ్బంది ఉచితంగా ముద్ద చర్మవ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ సిబ్బంది మాట్లాడుతూ పశువులకు ఈ లక్షణాలు జ్వరం, కాళ్ల దగ్గర పుండ్లు రావడం, పశువులు మేత తినకపోవడం జరుగుతుందన్నారు. వాటి నివారణకు గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేస్తున్నామన్నారు . పశువులను శుభ్రంగా కడిగి మంచి ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగభూషణం, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, దామోదర్‌రెడ్డి, శివారెడ్డి, బాబు, కృష్ణప్ప, రెడ్డెప్ప, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి


మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాటసమితి నాయకులు

మదనపల్లె : దళితుడిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేయాలని దళిత హక్కుల పోరాటసమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంచాల హరికుమార్, మండెంసుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎస్పీ ప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... 2024 మే23న ములకలచెరువు మండలం తిమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన సలాది జయకర్ బురకాయలకోట ఎంబీటీ రోడ్డులో స్నేహితులతో కలిసి వస్తుండగా, పెద్ద మొరవపల్లెకు చెందిన సురేష్‌రెడ్డి ద్విచక్రవాహనంలో అతివేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టాడన్నారు. దీంతో జయకర్, సురేష్‌రెడ్డిని నీకు కళ్లు కనపడలేదా అన్నందుకు, అతడిపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచి, కులంపేరుతో దూషించారన్నారు. దీనిపై 2024 మే 28న పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. కేసు రిజిస్టర్ అయినప్పటికీ సురేష్‌రెడ్డి ఏమాత్రం లెక్కపెట్టకుండా, ఫిర్యాదుదారుడైన జయకర్, కుటుంబసభ్యులను బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. దీంతో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బాధితుడి తరఫున డీఎస్పీ ప్రసాదరెడ్డిని కలిసి తక్షణం సురేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించేలా పికెట్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు.